క్లుప్తంగా

ఇఫ్తార్ విందు



అమరచింత: పట్టణంలోని జామియా మసీదులో శుక్రవారం అధ్యక్షుడు, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఉపవాస దీక్షాపరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందుకు ప్రత్యేక ఆహ్వానితులుగా టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర కల్లు గీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ హాజరయ్యారు. మతసామరస్యానికి రంజాన్ పండుగ ఆదర్శమన్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రతినిత్యం అల్లాను ప్రార్థించాలని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు శుక్రవారం రాత్రి స్థానిక మస్జిదే నూర్‌లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రఫీఖ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలాన అబ్దుల్‌అలీంరశాది ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్రగీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో షబీర్, సలీం, రహ్మతుల్లా, అజ్మతుల్లా, నల్గొండశ్రీను, ఎస్టీడీశ్రీను, గంగ, షంశీర్, రజాఖ్, తౌఫీఖ్, అశ్రఫ్, జియాఉర్ రహ్మాన్, ఇమ్రాన్, వాహిద్, ముస్లిం పెద్దలు, దీక్షపరులు పాల్గొన్నారు. అలాగే మస్జిదే ఆజం జాహిలో ఆరీఫ్, రహీం, యువకుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసారు.

మూగ మహిళకు చేయూత



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని మర్రికుంటలో గుర్తుతెలియని మూగ మహిళ విజయ మతిస్థిమితం లేకుండా తిరుగుతుండంతో గ్రామంలో హోటల్ నడుపుతున్న బాలరాజునాయక్, కంచె రాఘవేంద్ర ఆదరించి ఆమెకు 10 రోజులుగా భోజనం పెడుతున్నారు. ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డులో ఉన్న అడ్రస్ హైదరాబాద్‌లోని షాబాద్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. వారు వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి.. వెంటనే షాబాద్ పోలీసులతో మాట్లాడి ఆమె కుటుంబ సభ్యులను రప్పించి విజయను వారికి అప్పగించారు. మానవత దృక్పథంతో పది రోజులు అన్నం పెట్టి ఆదరించిన బాలరాజునాయక్, కంచె రాఘవేంద్రను ఈ సందర్భంగా ఎస్‌ఐ సన్మానించారు.

అందరికీ కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

ఖిల్లాఘనపురం: ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని ఎస్‌ఐ శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీజ కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌ను ఎస్‌ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇచ్చిన వెంటనే విద్యార్థులకు కంప్యూటర్ కోచింగ్ ఇప్పించడం వలన ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. పట్టణాలకు వెళ్లి కోచింగ్ తీసుకోవడానికి ఎన్నో ఇబ్బందులు ఉంటాయని, మండల కేంద్రంలోనే కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. నిర్వాహకులు సెంటర్‌కు వచ్చే విద్యార్థులకు అవసరమైన శిక్షణను సకాలంలో ఇవ్వాలన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పెబ్బేరు రూరల్: రంజాన్ పండుగ సందర్భంగా శుక్రవారం మండలంలోని పాతపల్లిలోని మైనార్టీలకు ఎంఐఎం మండల అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో సేవ చేయడమే దైవ ప్రార్థనకు అసలైన నిదర్శనమన్నారు. పాతపల్లి గ్రామ నాయకులు నాగేష్‌నాయుడు, చంద్రశేఖర్ మైనార్టీ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో ఎండీ గౌస్, ఆరీఫ్, అమేర్, సమీర్, ఇర్ఫాన్, ముజఫర్, మాసూమ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

కాశిరెడ్డి వాగు రోడ్డును నిర్మించండి

చిన్నంబావి: మండల కేంద్రం నుంచి గూడెం గ్రామానికి వెళ్లే కాశిరెడ్డి వాగు రోడ్డును పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఆరేళ్లుగా రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడం, కంకర పరచి ఉండటంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గూడెం గ్రామం నుంచి మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఏన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఇప్పటి వరకు ఆ రోడ్డును పట్టించుకోకవడం దారణమని వాపోయారు. వర్షాకాలం ప్రారంభం అయితే కాశిరెడ్డి వాగు దాటడానికి కూడా ఇబ్బందులు ఏర్పడతాయని, ఆలోపే రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం

- మిషన్ భగీరథ పైప్‌లైన్లకే నోచుకోని కాలనీలు కొన్ని..
- సీసీ రోడ్ల నిర్మాణంతో ధ్వంసమైన పైప్‌లైన్లు మరికొన్ని



వంటిమిట్టతండాలో నిరుపయోగంగా భగీరథ వాటర్ ట్యాంకు

వీపనగండ్ల: రూ.కోట్లు ఖర్చుపెట్టి మిషన్ భగీరథ పథకం ద్వారా మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు తాగునీరు అందించేందుకు శ్రీకారం చుట్టింది. కానీ అస్తవ్యస్త పైప్‌లైన్లు, భగీరథ అధికారుల నిర్లక్ష్యం వల్ల మండలంలోని చాలా గ్రామాల్లో ఈ వేసవిలో తాగునీటికి ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. గతంలో గ్రామాల్లో ఉన్న ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పంచాయతీ అధికారులు తాగునీటిని అందిస్తున్నా.. రాబోయే రెండు నెలల్లో ఎలాంటి నీటి సమస్యలు వస్తాయోనని అన్ని గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి వసతులను మెరుగుపరచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తప్పని నీటి కష్టాలు

మండలంలో సీసీ రోడ్ల నిర్మాణాల సమయంలో భగీరథ పైప్‌లైన్లు ధ్వంసమయ్యాయి. వాటిని అధికారులు సరిచేయలేదు. వంటిమిట్ట తండా, సంపత్‌రావుపల్లి, కల్వరాల, చౌడేశ్వరీ కాలనీ, గోపల్‌దిన్నె ఎస్సీ కాలనీ తదితర గ్రామాల్లో భగీరథ పైపులు ఉన్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆయా కాలనీవాసులకు తాగు నీరు అందడం లేదు.



హెల్త్ సెంటర్‌కు అందని నీరు

మండల కేంద్రంలో 40 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు సైతం 10 రోజులుగా తాగునీరు అందడం లేదు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న బోరు మోటారు చెడిపోవడంతో నీటి కష్టాలు మొదలయినట్లు ఆస్పత్రికి వచ్చిన రోగులు చెబుతున్నారు. గతంలో రెండుసార్లు మోటారు పాడవగా, మోటారు రిపేరు కోసం రూ.40 వేలు తన సొంత డబ్బులు ఖర్చు చేశానని సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ ప్రియాంక తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆస్పత్రి రోగులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామన్నారు.



సామూహికంగా నిర్మించుకున్న మినీ ట్యాంకుకు నీళ్లు పడుతున్న కల్వరాల మాజీ సర్పంచ్ ఉస్సేన్

వీపనగండ్ల మండల జనాభా 27,378		
కుటుంబాలు 6,558	బోరుబావులు 41	పని చేసేవి 40
చెరువులు 11	వాటర్ ట్యాంకులు 44	పనిచేస్తున్నవి 40
చేతి పంపులు 39	వినియోగంలో ఉన్నవి 18 మాత్రమే	

మిట్ట ప్రాంత కాలనీలకు..



గ్రామాల్లో మిట్ట ప్రాంతంలో ఉన్న కుటుంబాలకు తాగునీరు అందకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అదనంగా పైప్‌లైన్లను అమర్చి తాగునీటి వసతులను మెరుగుపరచాలని కోరినా స్పందించకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వాధికారులు పైప్‌లైన్లు అమర్చేందుకు అవసరమైన నిధులు మంజూరయ్యాయని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదు.

– మోహన్‌రెడ్డి, కల్వరాల

నీటి గోస భరించలేకపోతున్నాం



రూ.లక్షలు వెచ్చించి మా తండాలో మిషన్ భగీరథ ట్యాంకును నిర్మించారు. ఇప్పటికీ ఆ ట్యాంకులోకి చుక్క నీరూ చేరుకోలేదు. ప్రతి రోజు తమకు రెండు, మూడు బిందెల నీరు మాత్రమే అందుతుంది. తరుచూ అధికారులు వచ్చిపోవడమే తప్పా మా నీటి గోసను తీర్చడం లేదు.

– సభావత్ చిన్నమ్మ, వంటిమిట్టతండా

సత్వర చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీటిని అందిస్తున్నాం. కొన్ని గ్రామాల కాలనీల్లో భగీరథ నీరు అందకపోవడంతో ప్రత్యామ్నాయంగా బోర్ల ద్వార నీటి సరఫరా చేస్తున్నాం. రాబోయే రోజుల్లో నీటి సమస్య తలెత్తకుండా పాడైన బోర్లు, మోటార్లను రిపేర్ చేసి సిద్ధంగా ఉంచాం. భగీరథ పైప్‌లైన్ల ఏర్పాటుకు అధనపు నిధులు కూడా మంజూరయ్యాయి.

– శ్రీనివాసరావు, ఎంపీడీఓ, వీపనగండ్ల

ఏదులలో కంటి వైద్య శిబిరం



కంటివైద్య పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన ప్రజలు

గోపాల్‌పేట: ఏదుల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం హైదరాబాద్‌లోని శంకర కంటి ఆస్పత్రికి చెందిన రాముయాదవ్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన వారిని సొంతంగా వారి వాహనంలోనే తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి పంపుతారని సభ్యులు తెలిపారు. శుక్రవారం మొత్తం 125 మందికి కంటి పరీక్షలు చేయగా.. అందులో 65 మందికి ఆపరేషన్ చేయాల్సి ఉందని, వారిని తొందరలోనే హైదరాబాద్ తీసుకెళ్లి ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, గోపాల్‌యాదవ్, బుచ్చిరెడ్డి, కుర్మయ్య యాదవ్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

141 మంది కుష్టు రోగుల గుర్తింపు

పాన్‌గల్: కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. అందులో భాగంగానే మండలంలో ఈనెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఇంటింటి సర్వే నిర్వహించిందని పీహెచ్‌సీ వైద్యులు పేర్కొన్నారు. అందులో భాగంగానే ఇంటింటి సర్వేలో మండలంలో 52,241 మందిని పరీక్షించగా.. అందులో 141 మందికి వ్యాధి లక్షణాలు ఉన్నట్లు తేలిందన్నారు. లక్షణాలు ఉన్న వారికి విడతలు వారీగా చికిత్స అందిస్తూ రోగం నయం అయ్యే వరకు ఉచితంగా మందులు అందిస్తారని పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. ఈ వ్యాధి సూక్ష్మక్రిముల ద్వారా సంక్రమించే అంటువ్యాధి. గాలి ద్వారా రోగి నుంచి సాన్నిహిత్యం ద్వారా ఇతరులకు వ్యాపిస్తోంది. రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్న వారికి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. శరీరంపై పాలిపోయిన లేదా రాగి రంగు మచ్చలు ఉంటాయి. మచ్చలపై స్పర్శ, నొప్పి లేకపోవడం, శరీరంపై ముఖ్యంగా పాదాలు, చేతులు, వేళ్ల తిమ్మిర్లు ఉంటాయి. చర్మం దళసరిగా ఉండటం, చర్మంపై ప్రధానంగా నూనె రాసినట్లు నిగనిగలాడుతూ కన్పించినప్పుడు కుష్టుగా అనుమానించాలని వైద్యులు సూచిస్తున్నారు.



పాన్‌గల్‌లో కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేలో వైద్య సిబ్బంది (ఫైల్)

భూతగాదాలో ఇద్దరిపై కేసు నమోదు

కొత్తకోట రూరల్: తన పొలం తక్కువగా ఉందంటూ మరొకరి పొలంలో గల చెట్లను జేసీబీ సాయంతో పడగొట్టిన వ్యక్తులపై కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కనిమెట్టకు చెందిన పేరి కోటేశ్వర్‌రెడ్డికి గ్రామ శివారులో సర్వే నంబర్ 126/అ2లో 38గుంటల భూమి ఉంది. ఆ పొలంలో కొన్ని మామిడి చెట్లు, మరికొంత పొలంలో వరిపంట సాగు చేసేవాడు. అదే సర్వే నంబర్‌లో భీమా కాల్వ పైభాగాన కనిమెట్టకు చెందిన దొడ్ల రాంచంద్రయ్య, అతడి అన్నదమ్ములకు వ్యవసాయ పొలం కలదు. వారికి పొలం తక్కువగా ఉందంటూ కోటేశ్వర్‌రెడ్డితో తరచూ గొడవ పడేవారు. ఈనెల 28న దొడ్ల రాంచంద్రయ్య, అతడి తమ్ముడు దొడ్ల రాములు పొలం వద్ద ఎవరూ లేని సమయంలో పొలం గెట్టుకు ఉన్న చెట్లను తొలగించడంతో పాటు పొలాన్ని చదును చేశారు. విషయం తెలుసుకున్న కోటేశ్వర్‌రెడ్డి పొలం దగ్గరకు వెళ్లి తన చెట్లు తొలగించడం, చదును చేయడంపై వారిని నిలదీయడంతో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి, విచారణ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



కనిమెట్ట శివారులో గల వ్యవసాయ పొలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి

రోడ్డుకు మరమ్మతు చేపట్టండి

పాన్‌గల్: మండల తహసీల్దార్, ఎంపీడీఓ, పీహెచ్‌సీ, సింగిల్ విండో, వ్యవసాయ శాఖ కార్యాలయాలకు వెళ్లే దారి కంకర తేలి అధ్వాన్నంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ప్రతినిత్యం ఆయా కార్యాలయాలకు అధికారులు, వివిధ గ్రామాల నుంచి ఎంతో మందికి కార్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఆయా కార్యాలయాలకు వెళ్లే వారు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు ఇబ్బందిగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రతినిత్యం ఎంతో మంది అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్నా మరమ్మతుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత కార్యాలయాల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మండల కార్యాలయాలకు వెళ్లే రోడ్డు ఇలా..

భానుడి భగభగ

కోడేరు: రోజురోజుకు ఎండలు అధికమవుతున్నాయి. గత వారం రోజుల నుంచి భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం 10 గంటలకే సూర్యుడు భగభగమంటున్నాడు. దీంతో అత్యవసరమైతేనే బయటకు వస్తున్నారు. కొందరు పనులు వాయిదా వేసుకుంటున్నారు. ఇంట్లో కూడా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మండలంలో రోజురోజుకు ఎండ వేడిమి అధికం కావడంతో మండల ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ప్రతి రోజూ 41 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోందని అధికారులు పేర్కొన్నారు. ఉదయం 12 గంటల వరకే ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కూలీలు, రైతులు ఉదయం, సాయంత్రం వేళల్లో పని ముగించుకొని త్వరగా ఇంటిబాట పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు తలపై టోపీలు ధరించి ప్రయాణిస్తున్నారు. కాలినడకన వెళ్లేవారు గొడుగు పట్టుకొని వెళ్తున్నారు.



కోడేరులో 11 గంటలకే నిర్మానుష్యంగా మారిన రోడ్డు

శీతల పానీయాలకు పెరిగిన డిమాండ్

ఎండవేడికి తట్టుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో శీతలపానీయాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో కొబ్బరిబొండాలకు విపరీతమైన గిరాకీ పెరిగింది. ఇదే అదనంగా భావించిన వ్యాపారస్తులు పానీయాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. చల్లని మజ్జిక తాగి ఉపశమనం పొందుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లికి చెందిన సీతారాములు గురువారం రాత్రి మృతి చెందాడు. స్థానిక కాంగ్రెస్ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.5వేల నగదును పంపించడంతో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నగదును అందజేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి రూ.3వేలు స్థానిక నాయకుల ద్వారా అందించారు. గ్రామానికి చెందిన సగర యూత్ సభ్యులు బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.5వేల నగదును అందించారు. కార్యక్రమంలో సిద్ధయ్య, శ్రీశైలం, నాగిరెడ్డి, లక్ష్మారెడ్డి, తిక్కన్న, రఘుగౌడ్, నరేష్, నర్సింహ, మన్నెంకొండ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని రేమద్దులకు చెందిన రంగాపురం శివారెడ్డి సతీమణి స్వప్న గుండెపోటుతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు రాముయాదవ్, కార్యకర్తలు శుక్రవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



పామిరెడ్డిపల్లిలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్: పట్టణానికి చెందిన కాంపౌండర్ రాములు సతీమణి లక్ష్మీదేవి మృతి చెందడంతో విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని పీర్ల గుట్టకు చెందిన వరలక్ష్మి మృతి చెందడంతో కాంగ్రెస్ నాయకుడు సతీష్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కుటుంబానికి అండగా ఉంటాడని ధైర్యంగా ఉండాలన్నారు. నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాయం చేసే గుణాన్ని కలిగి ఉండాలి



గోపన్‌పేట చర్చిలో..



ఆత్మకూర్‌లోని చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

ఆత్మకూర్: ప్రపంచంలో శాంతి స్థాపన కోసం ఏసు క్రీస్తు తన జీవితాన్ని అంకితం చేశారని ఆయన చూపిన సన్మార్గంలో అందరూ పయనించాలని పాస్టర్లు సీజేజర్మీయా, డేవిడ్, విద్యాసాగర్ అన్నారు. గుడ్ ఫ్రై డే సందర్భంగా శుక్రవారం ఆత్మకూర్, మూలమల్ల, రేచింతల, ఖానపూర్, పిన్నంచర్ల గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బైబిల్ సూక్తులను వివరించారు. 40 రోజులపాటు ఆచరించిన అనంతరం క్రైస్తవులు ఏసయ్య మరణదినాన్ని పురస్కరించుకుని ప్రపంచ శాంతి కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు.

అమరచింత: సమాజంలో జీవిస్తున్న ప్రజలందరూ ఒకరినొకరు సహాయం చేసుకోని జీవించే గుణాన్ని కలిగి ఉండాలని పాస్టర్ హ్యాపీపాల్ అన్నారు. గుడ్ ఫ్రై డే సందర్భంగా పట్టణంలోని ఎంబీ కర్మేల్ చర్చిలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఏసు క్రీస్తు బోధనలు వివరించారు. అనంతరం చర్చిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మస్తీపురం, నందిమళ్ల, సింగంపేట, చంద్రగఢ్, నాగల్‌కడ్మూర్ గ్రామాల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌పీటర్, దీనకుమార్, విజయకుమార్, ప్రకాశం, ఇమ్మాన్యుయేలు, ప్రభుదాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: లోక కల్యాణం కోసమే యేసుక్రీస్తు శిలువలో మరణించారని ఆయన మరణం ద్వారా సమస్త మనవాళికి మోక్షం లభించిందని పాస్టర్ డేవిడ్ కొనియాడారు. శుక్రవారం గుడ్‌ఫ్రై డేను పురస్కరించుకొని మదనాపురం, గోపన్‌పేట, దుప్పల్లి, నర్సింగాపురం, కొన్నూరు, రామన్‌పాడు, అజ్జకొల్లు, కొత్తపల్లి చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కవి జనజ్వాలకు సన్మానం

వనపర్తి టౌన్: పట్టణానికి చెందిన ప్రజా కవి జనజ్వాలను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రంలోని జనజ్వాల ఇంటికి వెళ్లి సన్మానించారు. కవిత్వంతో ప్రజలను చైతన్యపరుస్తూ ఎందరో కవులకు జనజ్వాల స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. జనజ్వాల సేవలు వనపర్తి సమాజానికి అవసరమన్నారు. కార్యక్రమంలో బి.కృష్ణ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

కోడేరు: మండలంలో ఎత్తం, నర్సాయిపల్లి క్రాస్ రోడ్డు దగ్గర ఎస్‌ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆర్‌సీ, లైసెన్స్, తప్పక ఉండాలన్నారు. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికలు సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. నిబంధనలు అతిక్రిమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు

మదనాపురం: మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం రాత్రి పెద్దమ్మ తల్లికి బోనాలతో గ్రామస్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనం ఎత్తుకొని వచ్చి అమ్మవారి ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు యువతులు, మహిళలు నూతన వస్త్రాలు ధరించి పండుగ సంబురంలో పాల్గొన్నారు. ఆ ప్రాంతమంతా భక్తి పరవశ్యంతో మునిగిపోయింది. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

గువ్వల బంగారమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి

గోపాల్‌పేట: వనపర్తిలో చికిత్స పొందుతూ మరణించిన ఉపాధి కూలీ గువ్వల బంగారమ్మ కుటుంబానికి ప్రభుత్వం రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పోలికెపాడులో బంగారమ్మ ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంగారమ్మ ఉపాధి పనికి వెళ్లి పని చేస్తూ పడిపోతే, అక్కడ కనీసం ప్రథమ చికిత్స అందించేందుకు సౌకర్యాలు లేకపోవడం, ఆస్పత్రికి తీసుకుపోయినా సరైన వైద్యం అందించకపోవడం వల్లే బంగారమ్మ మరణించిందని ఆరోపించారు. వారి కుటుంబం దీనస్థితిలో ఉందని, వారి పిల్లలను గురుకుల పాఠశాలలో చేర్పించి ప్రభుత్వమే వారి బాగోగులు చూసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసి బాధిత కుటుంబ పరిస్థితిని వివరిస్తామని ఆంజనేయులు తెలిపారు.

మామిడి రైతులు విలవిల



పెద్దకొత్తపల్లి: మండలంలోని మామిడి రైతులు దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. ఈ సంవత్సరం వాతావరణం అనుకూలించకపోవడంతో మామిడి కాపు లేకపోవడంతో తల్లడిల్లిపోతున్నారు. ఐదు సంవత్సరాలుగా మామిడి తోటలు కాపు లేకపోవడంతో కౌలు రైతులు నష్టాలపాలవుతున్నారు. పెట్టుబడి రాక అవస్థలు పడుతున్నారు. మామిడి కాయలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తోటల యజమానులు, కౌలు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ ప్రాంతాలలో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకొని గిట్టుబాట ధర లేక నష్టపోతున్నారు.

మహిళల హక్కుల కోసం ఐక్య పోరాటం చేద్దాం

పెంట్లవెల్లి: మహిళల హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలు చేద్దామని ఐద్వా మండల అధ్యక్షురాలు ఆదిలక్ష్మి శుక్రవారం పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా రిజర్వేషన్లు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. అనంతరం 11 మందితో ఐద్వా కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లావన్య, సీతమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.